శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త





## వైభవంగా సుదర్శన నారసింహ యాగము



**బుచ్చి ఫిబ్రవరి 18 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని రామకృష్ణనగర్‌లో కొలువైవున్న శ్రీ కళా ్యణ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సుదర్శన నారసింహయాగం నిర్వహించారు.అర్చకులు అత్యంత భక్తి శ్రద్దలతో ఈ యాగాన్ని నిర్వహించారు.ఈ యాగంలో తహసిల్దారు పద్మజా దంపతులు కూర్చొని యాగం చేశారు.పూర్ణాహుతితో యాగాన్ని ముగించారు. అందరికి యాగపలాన్ని అందించారు.యాగాన్ని నరసింహచార్యులు,చంద్రస్వామి వేదమంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు.

## అభివృద్ధి పథంలో పయనించే ఎఫ్‌పీవోలకు నాబార్డు తోడ్పాటు



**కోవూరు,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పథంలో పయనింపజేస్తున్న ఎఫ్‌పీవోలకు నాబార్డు ద్వారా ఒక్కొక్క ఎఫ్‌పీవోకు రెండు కోట్ల మేర తనఖా లేకుండా రుణాలు అందించే ప్రక్రియ కూడా చేపట్టడం జరిగిందని నాబార్డు డీడీఎం రవిసింగ్ అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలోని ప్రగతి యువకేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై 50 టన్నుల నుంచి వెయ్యి మెట్రిక్ టన్నుల వరకు గోదాముల నిర్మాణానికి నాబార్డు ద్వారా సబ్సిడీతో అందజేస్తున్నామని, మార్చి 31 లోగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అదేవిదంగా వ్యవసాయంలో వస్తున్న నూతన సాంకేతిక పద్దతులపై రైతుల్లో మరింత అవగాహన పెంచడమే కాకుండా డ్రోన్‌పై కూడా శిక్షణ ఇచ్చేందుకు నాబార్డు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే రెండు మొబైల్ ఏటీఎంలు సహకార బ్యాంకు ఆధ్వర్యంలో తిరుగుతున్నాయన్నారు. మరో రెండు మొబైల్ ఏటీఎంలు కూడా అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మొబైల్ ఏటీఎంలలో అన్ని బ్యాంకులకు సంబంధించిన డెబిట్ కార్డులను డ్రా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అదేవిదంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బ్యాంకులకు ఎల్‌సీడీ స్ర్కీన్ ప్రొజెక్టులను బ్యాటరీతో కలిపి 15 వేల సబ్సిడీతో నాబార్డు ద్వారా అందజేస్తున్నామని, ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిదంగా సహకార ప్రాథమిక సొసైటీలను మరింత బలోపేతం చేసేందుకు నాబార్డు ద్వారా 11 పెట్రోల్ బంకులు ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే సంగం, సీతారామపురం మండలాల్లో ఈ పెట్రోల్ బంకులను ప్రారంభించడం జరిగిందన్నారు. అదేవిదంగా నాబార్డు ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు, రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం జీజీవై, పీఎంజేబీవై, అటల్ ఫించన్ యోజన పథకాలపై ఖాతాదారులు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి యువకేంద్రం చైర్మన్ గునుపాటి భూపేష్‌రెడ్డి, సహకార భారతి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## చందనాలంకారంలో గంగమ్మ తల్లి



**కోవూరు,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన రహదారిలో వెలసి ఉన్న శ్రీ గంగమ్మ దేవస్థానంలో అమ్మవారు మాఘ మాస ఆదివారం పర్వదినం సందర్భంగా చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దండి శ్రీనివాసులు-మమత దంపతులు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో వచ్చిన భక్తులకు అన్న ప్రసాద్ వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తారకరత్న మరణం బాధాకరం

**నెల్లూరు ఫిబ్రవరి 19, ప్రభాతవార్త-వైద్యం** ప్రముఖ సినీనటుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ మనవడు, తెలుగుదేశం పార్టీ యువనేత, సినీనటుడు నందమూరి.తారకరత్న అకాల మరణం బాధాకరమని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్ అజీజ్‌లు ఆదివారం తమ సంతాపాన్ని తెలియచేశారు. తనను బీద అన్నయ్య అంటూ ఆప్యాయంగా పలకరించే తారకరత్న ఆరోగ్యవంతులై తిరిగి వస్తారని తలచానని, తిరిగిరాని లోకాలకు చేరడం తనకు తీవ్రదిగ్భ్రాంతికి గురి చేసిందని బీద.రవిచంద్ర అన్నారు. తారకరత్న మరణం పార్టీకి తీరనిలోటన్నారు. వ్యక్తిగతంగా మంచి మనసు ఉన్న తారకరత్న మన మధ్య లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని అబ్దుల్‌అజీజ్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్ధిస్తున్నామని, ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

**తారకరత్న ఆత్మకు శాంతి చేకూరాలి**

నందమూరి.తారకరామారావు మనవడు, ప్రముఖ సినీనటుడు నందమూరి.తారకరత్న ఆత్మకు శాంతి చేకూరాలని తెలుగుదేశం పార్టీ నగర నియోజకవర్గ అధ్యక్షుడు, నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ధర్మవరం.సుబ్బారావు, కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డిలు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర, బీసీ ఫెడరేషన్ అధికార ప్రతినిధి, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ గంజాం.రాఘవేంద్రలు హైదరాబాద్‌లోని తారకరత్న నివాసంలో ఆయన పార్ధివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## సమరసతా వేదిక జిల్లా సమావేశం




**బుచ్చి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో సామాజిక సమరసతా వేదిక జిల్లా సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సమరసతా వేదిక అఖిలభారత అద్యక్షులు శ్యాం ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. రాబోయే రెండు జరగబోయే కార్యక్రమాల గురించి చర్చించారు. పారిశుద్ద్య కార్మికులకు అభినందించి వారికి సన్మానం చేసే కార యక్రమం బుచ్చిరెడ్డిపాళెం,నెల్లూరు, వింజమూరు, టిడి గూడూరు, ప్రాంతాలలో చేయాలని నిశ్చయించారు. ఏఫ్రిల్ 5 న బాబు జగ్జీవన్‌రావు జయంతి ,డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి, జ్యోతిరావు పూలే జయంతులను ఎక్కువ స్ధలాల్లో నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందని వారు తెలిపారు.ఈ సందర్బంగా ముఖ్య అతిధి శ్యాం ప్రసాద్ మాట్లాడుతు సమరసతాను సాధించడం సమాజంలో కులమత బేధాలను పారద్రోలాలని మనమందరం కలిసి దేశ సమగ్రతకు సమాజ హితంకు పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం అద్యక్షులు నరసింహమూర్తి, కార్యదర్శలు శరత్‌బాబు, సుధీర్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## సముద్ర స్థానానికి వచ్చిన భక్తులు ప్రసాద వితరణ

**ముత్తుకూరు,ఫిబ్రవరి19,ప్రభాతవార్త** ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పంచాయతీలో శివరాత్రి సందర్భంగా సముద్ర స్థానానికి వచ్చిన భక్తులకు హరిహరాదుల సేవాసమితి సభ్యులు ప్రతి ఏటా సముద్ర స్థానానికి వచ్చే 10వేల మందికి భక్తులకు ప్రసాదాలుఅందజేయడం జరుగుతుంది.ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు మాట్లాడుతూ 2017నుండి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టామన్నారు.ఈ సారిభక్తులు ఎక్కువగా రావడం జరిగిందని,ఉదయం 6నుండి మధ్యాహ్నం 12గంటల వరకు భోజనప్రసాదాలుపంపిణీ చేయడం జరిగిందన్నారు.దాతల సహకారంతో ప్రతీ ఏడాది భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నామని,ఇలాగే దాతలు సహకరించాలని వారు కోరారు.

# ప్రశాంతంగా ఎస్‌ఐ రాతపరీక్ష



ఎస్సై రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ విజయరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.











## కావలి మల్లయ్య నందిసేవ, గ్రామోత్సవాన్ని దర్శించుకున్న భక్తజనం

**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కావలి శివాలయంలో రాత్రి ఒంటి గంటకు జరిగిన మహాలింగోద్భవం అనంతరం శ్రీ దుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి నందిసేవ గ్రామోత్సవాన్ని పట్టణ పురవీధులలో భక్తులు దర్శించుకొని తరించారు. రాత్రి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ నందిసేవ గ్రామోత్సవం పట్టణ పురవీధుల మీదుగా ఆదివారం ఆలయానికి చేరింది. వివిధ రకాల పూల గజమాలలతో అలంకరించిన స్వామి వారిని భక్తులు దర్శించుకొని హారతులు ఇచ్చారు. ఆలయ అనువంశిక అర్చకులు ఎ.ఆర్.శశిధర్‌గురుకుల్ నందిసేవ గ్రామోత్సవంలో భక్తులు పాల్గొని దర్శించుకునేలా సౌకర్యాలు కల్పించారు. ఈ గ్రామోత్సవం ముందు వివిధ రకాల వాయిద్యాలు, వేషదారణలతో ఈ గ్రామోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## కన్నుల పండువగా శ్రీకామాక్షిదేవి సమేత చంద్రమౌళీశ్వర స్వామి గ్రామోత్సవం



**అనుమసముద్రంపేట ,ఫిబ్రవరి19 ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలం చిరమనగ్రామంలో వెలసియున్న శ్రీ కామాక్షిదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా శివాలయంలో ఆలయ ప్రనధాన పూజారి కుందుర్తి సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలు , ఆలయ నిర్వాహకులు కాంటరెడ్డి రవీంద్రారెడ్డి-ప్రసూన , కాటంరెడ్డి నర్సింహారెడ్డి-శైలజ ఆధ్వర్యంలో చంద్రమౌళీశ్వర స్వామికి-అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శ్రీస్వామి-అమ్మవార్లకు కళ్యాణం ఉభయదాతలు కాంటంరెడ్డి రవీంద్రారెడ్డి-ప్రసూన , వారి సోదరులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శ్రీచంద్రమౌళీశ్వరస్వామి లింగోద్భవం సందర్భంగా అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పక్క రాష్ర ఆటల నుంచి తీసుకువచ్చిన బుట్టబొమ్మల ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం రామిరెడ్డి నర్సింహారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో స్వామి-అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి పూలతో అలంకరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వామి-అమ్మవార్ల గ్రామోత్సవం ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామోత్సవంలో ప్రజలకు ఉభయదాత కర్నాటి మధుసూధన్‌రెడ్డి-రాధ దంపతుల ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు.

## పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ

**కోవూరు,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఎస్సై రాత పరీక్షా కేంద్రానిన జిల్లా ఎస్పీ విజయరావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కేంద్రం వెలుపల ప్రాంతంలో రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి పర్యవేక్షణలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కోవవూరు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై డి. వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.



## వేడుకగా గంధమహోత్సవం



**సంగం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** సంగం మండలం దువ్వూరు గ్రామంలో శ్రీశ్రీశ్రీ హజరత్ గరీబ్ నవాజ్ మొయిద్దీన్ చిష్టి రహమతుల్లా అలై అజ్మీరిస్వామి వారి గంధమహోత్సవం వైభవంగా నిర్వహించారు.దువ్వూరు గ్రామంలోని ఆస్తానా ఏనూరియాలో హజరత్ షేక్‌భాషా సాహెబ్ నూరి ఆద్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. మేళతాళాల నడుమ గంధమహోత్సవాన్ని గ్రామంలోని పురవీదులలో నిర్వహించారు.గంధం ఆస్ధాన ఏ నూరియాకు చేరుకున్న అనంతరం ముస్లీం మత పెద్దలు పొల్గొని ప్రార్ధనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రంధమహోత్సవాన్ని తిలకించారు. గంధమహోత్సవానికి వచ్చిన భక్తులకు గ్రంధాన్ని పంచిపెట్టారు ప్రసాదాలు అందజేశారు.గంధమహోత్సవం సందర్బంగా మద్యహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆస్ధాన ఏ నూరియా కమిటి సభ్యులు,భక్తులు తదితరులు పాల్గోన్నారు.

## మోటార్ బైకును ఢీకొన్న కారు - ఒకరు మృతి







**సంగం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త** సంగం మండలం రాంపు సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు రెండు బైకులను ఢీకొట్టింది.విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటనా స్ధలానికి చేరుకున్నారు.క్షతగాత్రులను బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ నాగార్జునరెడ్డి వివరాల మేరకు ఈ సంఘటనలో వెంకట శివప్రసాద్‌కి తీవ్రగాయాలు కాగా . వెంటనే ఆయనను వైద్యశాలకు తరలించేలోపు మార్గ మద్యంలో మృతి చెందాడని తెలిపారు.శివప్రసాద్‌ది బుచ్చిరెడ్డిపాలెం అని ఆయన చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.విషయం తెలిసి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## తూర్పు రాయలసీమ ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను ఆదరించండి



**నెల్లూరుటౌన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా ఆమ్ ఆద్మీ పార్టీ అధిష్టానం అవకాశం కల్పించిందని అప్పంగారి జయరాం తెలిపారు. నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థి దశ నుంచి విద్యార్థి నాయకుడిగా విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశానన్నారు. నిరుద్యోగుల స్థితిగతులు తనకు బాగా తెలుసునన్నారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆదరించి తనకు మొదటి ప్రాధాన్యత ఓట్లను వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. తన విజయం ప్రజా విజయంగా భావించి తన వంతు బాధ్యతగా నిరుద్యోగ నిర్వహణతో పాటు సమసమాజ స్థాపనకు ప్రాధాన్యత ఇస్తానని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు గుర్రంకొండ సర్దార్, ఉపాధ్యక్షులు షేక్ ఉస్మాన్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు నాగూర్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**గుడ్లూరు, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** భరతమాత ముద్దు బిడ్డ, దేశభక్తి కలిగిన, ధీరత్వానికి మారుపేరైన మరాఠీ యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పుట్టిన రోజు సందర్భంగా గుడ్లూరులోని బస్టాండ్ సెంటర్‌లో బిజెపి సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు బిజెపి అధ్యక్షులు ఇన్నమూరి సుధాకర్, మండల సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షులు చలువాది చిన్న(ఎయిర్టెల్ చిన్న), మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కొత్తూరి శ్రీనివాసులు, బిజెపి యువమోర్చా నాయకులు జలగం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## బాబా స్తూపానికి లక్ష రూపాయలు విరాళం



**కందుకూరు, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** మచిలీపట్నం సమీపంలో ఉన్న గూడూరులో బాబా పరమపదించి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా నిర్మిస్తున్న 108 అడుగుల స్తూపానికి ఆదివారం లింగసముద్రం మండలం రాళ్లపాడు గ్రామానికి చెందిన వరికూటికృష్ణారెడ్డి ధర్మపత్ని వరమ్మ లక్ష రూపాయలను కానుకగా శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా స్తూపం చైర్మన్ మాట్లాడుతూ బాబా పరమపదించి 100సంవత్సరాలు పూర్తిఅయిన సందర్భంగా పూజ్య గురూజీ రామ్‌రతన్‌జి అదేశాల మేరకు అధ్యాత్మిక కార్యక్రమాలు చేసుకునేందుకు రామ్‌రతన్‌జీ ఆశ్రమం నందు 108 అడుగుల బాబా స్తూపాన్ని నిర్మిస్తున్నామని, త్వరలోనే నిర్మాణం పూర్తయిప్రారంభోత్సవం చేసుకుంటామని తెలిపారు. ఈ స్తూపం ప్రపంచ ఖ్యాతిని అందుతుందని బాబా వాక్కని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి బాబా అశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలోసూరం వేణుగోపాల్‌రెడ్డి, కొండూరి వసంతరావు తదితరులు ఉన్నారు. సువర్ణ యంత్రానికి విరాళం. కందుకూరు గ్రామదేవత శ్రీ అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణపనులు శరవేగంగా సాగుతున్నాయి. అమ్మవారి పాదాల చెంత ఉంచే సువర్ణయంత్రానికి ఆదివారం పేర్లమెట్ట నిర్మల జ్ఞాపకార్థం భర్త నరసింగరావు కుమారుడు మనోజ్ కుమార్, కోడలు వాసవి 5816లను నిర్మాణ కమిటీ సభ్యుడు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునఃనిర్మాణానికి సహకరించిన దాతలకు, వారి కుటుంబసభ్యులకు అమ్మవారి ఆశీస్సులుఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మంచిరాజు మురళీ మోహన్, ఆలయఅర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## నందుమూరి తారకరత్నకు ఘన నివాళి



**కందుకూరు, ఫిబ్రవరి19, ప్రభాతవార్త:** అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించిన సినీనటుడు నందమూరి తారకరత్నకు కందుకూరు తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళ్లు అర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని 2నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ నారా లోకేష్ యువగళం పాదయాత్రలో తొలిరోజు తారకరత్న ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, అప్పటి నుండి ఆయన బెంగళూరులో చికిత్స పొందుతూ మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, రాష్ట్ర కమిటీ నాయకులు చిలకపాటి మధు, కూనం నరేంద్ర, గోచిపాతలమోషే, బత్తిన ఆదెమ్మ, చుండూరి శ్రీనివాసులు, కమిటీ నాయకులు లక్ష్మీరాజ్యం, శైలజ, రవిచంద్ర, వెంకటకృష్ణ, వేణు, శిఖామణి, వీరాస్వామి, రసూల్‌బీ, శ్రీలక్ష్మీ, రత్తమ్మ, సీత, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మారామస్వామివారి ఆలయానికి ఫ్యాన్లు బహుకరణ



**బుచ్చి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** సంగం మండలం అన్నారెడ్డిపాలెంగ్రామంలోని ఆత్మారామస్వామి వారి దేవస్థానానికి బుచ్చిరెడ్డిపాలెంకి చెందిన అచ్యుత్ సుబ్రమణ్యం తన తల్లిదండ్రులు అచ్యుత్ సుబ్బారావు, లక్ష్మీకాంతమ్మల జ్ఞాపకార్ధం మూడు ఫ్యాన్లు బహుకరించారు. అన్నారెడ్డిపాళెం గ్రామానికి చెందిన బండా హరికిషోర్‌రెడ్డి, నాగిరెడ్డి మూడు ఫ్యాన్లు తీసుకొని అచ్యుత్ సుబ్బయ్య కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు. అలాగే అనితా ఈవెంట్స్ తరపున అనితా ఆమె భర్త ప్రదీప్ రెండు ఫ్లెడ్‌లైట్లు దేవస్థానానికి బహుకరించారు. వారికి కూడా ఆలయ అభివృద్ధి నిర్వాహకులు బండా హరికిషోర్‌రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## ప్లాస్టిక్ కవర్లవాడితే చర్యలు తప్పవు



**బుచ్చి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం రాఘవరెడ్డినగర్ కాలనీ, జొందాదిబ్బ రోడ్డు వద్ద ముంబాయి రహదారిలో చేపలు అమ్ముతున్న దుకాణాలను కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో ఉన్న కవర్లన్నింటిని ఆయన స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే ఆయన చేపదుకాణాలు పరిశీలించారు.

## చంద్రప్రభవాహనంపై శ్రీకళ్యాణవేంకటేశ్వరస్వామి



**బుచ్చి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం లోని రామకృష్ణానగర్‌లో కొలువైవున్న శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారు చంద్రప్రభ వాహనంపైన భక్తులకు దర్శన మిచ్చారు. గ్రామోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా తుమ్మల పెంచలరెడ్డి, రమణమ్మ, తోట శ్రీనివాసులురెడ్డి, సరిత కుటుంబసభ్యులు వ్యవహరించారు. కార్యక్రమాలు ఆలయ కమీటి వారు పర్యవేక్షించారు.

## బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటిని కలిసిన టైలర్లు



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపులేటి సుధాకర్‌ను కావలి టైలర్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. కావలి పట్టణంలోని సుధాకర్ కార్యాలయంలో ఆదివారం టైలర్స్ అసోసియేషన్ సభ్యులు పసుపులేటిని కలిసి టైలర్సడే కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. ఈ నెల 28వ తేది టైలర్సడే సందర్భంగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనాలని పసుపులేటిని కోరారు.

## పేదల కోసమే సంక్షేమ కార్యక్రమాలు



**వింజమూరు ,ఫిబ్రవరి19ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలోని పేదల కోసం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలు విరివిగా చేపడుతున్నట్లు ట్రస్ట్ చైర్మెన్ కాకర్ల సురేష్ పేర్కొన్నారు . ఆదివారం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు. గత నెల 8వ తేదీన ట్రస్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరం ద్వారా పరిక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేస్తామన్నామని అందులో భాగంగానే 45మందికి కంటి అద్దాలను అందించామన్నారు. కంటి శుక్లాలు ఉన్నవారిని 22మందిని గుర్తించామని వారికి నెల్లూరులోని డాక్టర్ రాజశేఖర్ సూపర్‌స్పెషాల్టీ ఐ కేర్ నందు ఆపరేషన్లు త్వరలో నిర్వహించి వారికి కూడా అవసరమైన కంటి అద్దాలు, మందులను అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలను ట్రస్ట్‌లో భాగస్వాములను చేస్తూ అన్ని వర్గాల ప్రజలు, పేదలను గుర్తించి మెరుగైన వైద్యసేవలను అందించేందుకు ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడంతోపాటు శస్త్రచికిత్సకు అవసరమైన నిధులను కూడా ట్రస్ట్‌ద్వారానే ఖర్చు చేస్తామన్నారు. పేద విద్యార్థులకు విద్యాపరంగా సాయం, యువతకు ఉపాధి , ఉద్యోగంలో తోడ్పాటును అందిస్తామన్నారు. మానవసేవే-మాధవసేవగా భావించి తాను ఈ ప్రాంత వ్యక్తిగా, ఈప్రాంతంపై మమకారంతో తన మూలాలను మరువకుండా ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను చేపడతానన్నారు. 25సంవత్సరాల సుదీర్ఘ ప్రణాళికతో ఈ ప్రాంతంలో సేవలందించేందుకు తాను ఒక రూపకల్పన చేశానన్నారు. త్వరలోనే ఈప్రాంతంలో తమ ట్రస్ట్ ద్వారా అనేక కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కాకర్ల వెంకటేశ్వర్లు, ప్రసాద్, మహేష్, జి.గోపి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభా విద్యార్థినికి ఆర్థికసాయం



**వింజమూరు ,ఫిబ్రవరి19ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని లెక్కలవారిపాళెంకు చెందిన జిల్లేళ్ళ వెంకటహర్షిణిని నేషనల్ పోటీల్లో పాల్గొనేందుకు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చైర్మెన్ కాకర్ల సురేష్ 25వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. జిల్లేళ్ళ వెంకటహర్షిణి నంధ్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ క్రీడల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించింది . షిరిడిలో జరిగిన నేషనల్ జంప్‌రోప్‌పోటీల్లో పాల్గొనేందుకు కాకర్ల సురేష్ విద్యార్థినికి 25వేలరూపాయలను అందించారు. దాంతో ఆమె నేషనల్ పోటీల్లో పాల్గొని కాంస్యపతకాన్ని సాధించింది. ఆదివారం వింజమూరు వచ్చిన కాకర్ల సురేష్‌ను హర్షిణి తల్లిదండ్రులు శ్రీనివాసులు-మహేశ్వరిలు కలిసి ట్రస్ట్ ద్వారా అందించిన సాయంతోనే తమ చిన్నారి పోటీల్లో పాల్గొని విజయం సాధించగలిగిందని కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్నవారికి ఏ రంగంలోనైనా రాణిస్తారని, ప్రతి పనికి ప్రతిభే కొలమానంగాభావించాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు దేగా మధు తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



**వింజమూరు ,ఫిబ్రవరి19ప్రభాతవార్త:** హిందూ సామ్రాజ స్థాపకుడు ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం పాత బస్టాండు సెంటర్‌లో బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ కాకర్ల సురేష్‌లు హాజరయ్యారు. ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడేందుకు మహారాష్ట్ర వీరుడు ఛత్రపతి శివాజీ ఎంతో ధైర్యంతో మొగలాయిలను ఎదుర్కొని హిందూ సామ్రాజ్యాన్ని కాపాడిన వ్యక్తి అని కొనియాడారు. శివాజీ మహిళలను తమ తోబుట్టువులుగా భావించి వారిని గౌరవించి మహిళలు ఎక్కడయితే పూజింపబడతారో అక్కడే శాంతిసౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని భావించిన వ్యక్తి శివాజీ అన్నారు . అలాంటి ఆదర్శజీవితాన్ని గడిపిన వ్యక్తి జయంతిని జరుపుకోవడం గర్వకారమణమన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు దేగా మధు యాదవ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, నాయకులు నీలం సంజీవరెడ్డి, కొమ్మి శ్రీనివాసులునాయుడు, కిషోర్, అబ్దుల్ నబి, కాకర్ల వెంకటేశ్వర్లు, తిరుపతాచారి, షేక్ ఖాజావలి, ఎన్.రాయుడు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**వింజమూరు, ఫిబ్రవరి19ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో సోమవారం ఉదయం 7.30నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఎఇ శ్రీనివాసులు తెలిపారు. వింజమూరు మండలానికి సరఫరా అయ్యే మోటచింతలపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు చేస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందన్నారు. కావున ప్రజలు గమనించి సహకరించాలన్నారు.

## హిందువుల మనోభావాల్ని కించపరుస్తున్న వైసిపి ప్రభుత్వం బిజెపి మహిళా నేత పద్మావతి శ్రీదేవి ధ్వజం



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం హిందువుల మనోభావాలను కాలరాస్తూ కించపరుస్తుందని బిజెపి కావలి పట్టణ మాజీ మహిళా అధ్యక్షురాలు, శ్రీసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు పద్మావతి శ్రీదేవి ధ్వజమెత్తారు. ఆదివారం ఆమె మాట్లాడారు. ఒంగోలు, తదితర ప్రాంతాలలో హాస్టల్ విద్యార్థులు ఆకలికి తట్టుకోలేక అధికారుల ముందు కన్నీళ్ళతో మొరపెట్టుకున్నారన్నారు. పిల్లల ఆకలి తీర్చలేని, అర్హులైన వృద్దులకు పెన్షన్ అందించలేని ఈ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్విటర్‌లో మహాశివరాత్రి పర్వదినాన శివునికి పాలాభిషేకం చేయవద్దని పిలుపు ఇచ్చేలా పోస్ట్ పెట్టడం దుర్మార్గమన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీయడమన్నారు. గతంలో దీపావళి సందర్భంగా టపాకాయలు కాల్చవద్దని ఈ ముఖ్యమంత్రి చెప్పడం హిందువుల సాంప్రదాయాలను దెబ్బతీయడమేనన్నారు. ఇతర మతాల పండుగుల సమయంలో గోమాంసం, మద్యం సేవించకుండా వుండాలని వైసిపి ట్విటర్‌లో పిలుపు ఇచ్చిందా అని ఆమె ప్రశ్నించారు. శివరాత్రి సందర్భంగా వైసిపి వాళ్ళు సోషల్ మీడియాలో పోస్టును వెంటనే తొలగించి హిందూ సమాజానికి తక్షణం క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. క్రిస్మస్ పండుగకు ఇటువంటి పోస్టులు ఈ ప్రభుత్వం ఎందుకు పెట్టలేదన్నారు. సెమీ క్రిస్మస్ సభలకు పెట్టే ఖర్చుతో కోట్లాది మంది పేదల కడుపునింపవచ్చునన్నారు. అప్పుడు ఈ నోరు పెగలదని, నీతులు పలకవని ఆమె దుయ్యబట్టారు. తిరుపతి, కనకదుర్గమ్మ ఆలయాలలో ప్రవేశ, సేవల టికెట్ల ధరలు విపరీతంగా పెంచి ఆలయాలకు రాకుండా భక్తులను ఇబ్బందులకు గురి చేయడం దుర్మార్గమన్నారు. వైసిపి పాలనలో హిందూ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా జీవోలు ఇవ్వడం పవిత్ర దేవాలయాలపై దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. సియం జగన్‌రెడ్డి పరిపాలన తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పద్మావతి శ్రీదేవి హెచ్చరించారు.

## నందివాహనసేవలో తారకేశ్వరస్వామి వారు



**సంగం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో కొలువైవున్న శ్రీ జ్ఞానప్రసూనాంబ తారకేశ్వరస్వామి వారు మహాశివరాత్రి పురస్కరించుకొని నందివాహనంపైన భక్తులకు దర్శన మిచ్చారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలను అర్చకులు గోసుకొండ రామచంద్రయ్యస్వామి నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా గుండ్రా రఘురామిరెడ్డి, సుదర్శనమ్మ, పెనుమల్లి వెంకటరెడ్డి, సుదర్శనమ్మ జ్ఞాపకార్ధం పెనుమల్లి శివ ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీ ప్రసూన, కుమార్తె శివప్రియ వ్యవహారించారు.

## 98 గ్రిగ్స్ మెమోరియల్ పోటీలలో గండిపాళెంవిద్యార్థులకు ప్రథమస్థానం



**ఉదయగిరి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరులో 98 వ గ్రిగ్స్ మెమోరియల్ ఆటలపోటీలు 2022-23 సంవత్సరాలకు సంబంధించిన ఈనెల 15,16,17 తేదిలలో నిర్వహించారు. వింజమూరు ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ పోటీలలో సీనియర్స్ బాలికల త్రోబాల్ పోటీలో గుంటుపల్లి కొండయ్య చౌదరి, సుబ్బమ్మ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల గండిపాళెం విద్యార్థులు ప్రథాస్థానం విజేతలుగా నిలిచారు. ప్రథమస్థానంలో గెలుపొందిన జట్టును పాఠశాల ప్రధానోపాధ్యాయులు మావులూరు వెంకటేశ్వర్లు, పిఎంసి చైర్మన్ ఎస్‌కె .రియాజ్, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, అభినందించారు. విజయం సాధించిన ఈ జట్టులో గొల్లపల్లి శృతి, జడ కళావతి, పలువురు విద్యార్థినులున్నారు.

## ఆటోబోల్తా - ఇద్దరికి గాయాలు

**ఉదయగిరి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలం గండిపాలెంలోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం మధ్యహ్నం 2 గంటల సమయంలో ఆటో ప్రమాదానికి గురైంది. పెద్దిరెడ్డిపల్లి నుండి ఉదయగిరి వైపు వెలుతున్న ఆటో నెల్లూరు దగ్గర వున్న కొత్తూరు గ్రామానికి చెందినదని స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో ఆటోలో 12 మంది ప్రయాణికులుండగా అందులో సుజిత్, సిద్దు, అనేయువకులకు తీవ్రగాయాలు అయ్యాయి. సంఘటన విషయం తెలుసుకున్న స్థానికులు 108కు తెలియపరచగా వారు క్షతగాత్రులను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## వ్యవసాయ కార్మిక సంఘం కేంద్ర కమిటీ సభ్యులుగా పుల్లయ్య

**అనంతసాగరం, ఫిబ్రవరి19ప్రభాతవార్త:** వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత మహాసభలు వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని హౌరాలో జరిగిన మహాసభలో కేంద్ర కమిటీ సభ్యులుగా మంగళ పుల్లయ్య ఎంపికయ్యారని అనంతసాగరం మండలం సిపిఎం కార్యదర్శి ఎస్.కె.అన్వర్‌బాషా తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుడు స్థాయి నుంచి నేడు దేశంలో అతిపెద్ద వర్గ సంఘం అయిన వ్యవసాయ కార్మిక సంఘం అబఖిల భారత కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎంపిక కావడం హర్షదాయకమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## మృతుల కుటుంభాలకు పాపకన్ను మధుసూధన్ రెడ్డి ఆర్థిక సాయం



**గుండవోలు(రాపూరు), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ఇటీవల ఏపూరు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుండవోలు గ్రామానికి చెందిన గంగోడి ప్రతాప్ కుటుంబ సభ్యులకు ఆదివారం రాపూరు మండల వైసిపి నాయకుడు మాజీ ఏయంసీ ఛైర్మన్ పాపకన్ను మధుసూధన్ రెడ్డి రూ. 50 వేల ఆర్థిక సాయాన్ని ఆందజేశారు. ఈ మేరకు ఈ మొత్తాన్ని మండల జెసిఎస్ కన్వినర్‌దందోలు నారాయణ రెడ్డి మృతుల స్వగ్రామమైన గుండవోలుకు వెల్లి మృతుల కుటుంబ సభ్యులకు ఆందజేశారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదం విషయం తెలుసుకున్న మధుసూధన్ రెడ్డి ఆరోజే మృతులకుటుంబ సభ్యులతో మాట్లాడటంతో పాటు, ప్రమాదానికి కారణమైన వాహనం యజమానులతో మాట్లాడి కొంత పరిహారం ఇచ్చేలా ఒప్పించడం జరిగిందన్నారు. దీంతో పాటు ఆయన కూడా కొంత మొత్తాన్ని పరిహారంగా ఆందజేశారన్నారు.

## నృసింహుని సన్నిధిలో దేవదాయ శాఖ అధనపు కమీషనర్



**పెంచలకోన(రాపూరు), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారిని దేవాదాయ శాఖ అధనపు కమీషనర్ కె. రామచంద్ర రావు కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగాఆలయానికి వచ్చిన ఆదనపు కమీషనర్‌కు ప్రధానార్చకులు, వేదపండితులు, పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామి వారికి, అమ్మవారికి, అంజనేయ స్వామి వారికి ఆయన పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంవేదపండితులు వేదమంత్రాలతో వారి కుటుంబసభ్యులకు ఆశీర్వచనాలు ఆందజేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని ఆందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో చేయవలసిన పలు అభివృద్ధి పనులపై ఇఒకు ఆయన చూసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయక కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి, ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, వేదపండితులు త్రినాథ్ స్వామి, నాగరాజు స్వామి, కార్యలయం సిబ్బంది సారధి తదితరులున్నారు.

## కోలహలంగా రజికుల బండదేవర



**కలువాయి ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** మండలకేంద్రమైన కలువాయిలో రజిక సోదరుల ఆధ్వర్యంలో బండదేవర కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. ప్రతి ఏడాది నిర్వహించే ఈకార్యక్రమానికి దూర ప్రాంతాలలో ఉండే రజిక సోదరులు గ్రామానికి చేరుకొని ఇనుకుంట అంకమ్మ అమ్మపాల పొంగళ్ళు కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. ఇళ్ళ వద్ద నుండి మహిళలు సాంప్రాదయ బద్ధంగా అమ్మవారికి పసుపు, కుంకుమ సారి సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో పొంగళ్లు పొంగించి నివేదన చేశారు. మధ్యహ్నా పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో రజిక సోదరులతోపాటు కలువాయి జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి, ఎంపిపి ఆర్ లక్ష్మీదేవి, సొసైటీ అధ్యక్షులు చల్లా సుబ్బరామి రెడ్డి, కలువాయి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వ్యవస్థాపకులు నరసయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## నందమూరి తారకరత్న అకాల మరణం తీరని బాధాకరం



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ప్రముఖ నటుడు నందమూరి తారకరత్న అకాల మరణం తీరని బాధాకరమని తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. కావలి పట్టణ ఏరియా వైద్యశాల వద్ద మాలేపాటి ఆధ్వర్యంలో టిడిపి నేతల, అభిమానుల మధ్య ఆదివారం నందమూరి తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాలేపాటి మాట్లాడారు. తారకరత్న ఇకలేడన్న వార్తను జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, నందమూరి వంశాభిమానుల మనసుల్ని తారకరత్న మృతి కలిచివేసిందన్నారు. ఆయన మరణం తీరని లోటు అన్నారు. ఆయన చేసిన సేవల్ని కొనియాడారు. తారకరత్న పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని మాలేపాటి కోరారు. నందమూరి తారకరత్న కుటుంబ సభ్యులకు మాలేపాటి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అమర్‌రహే తారకరత్న అన్న నినాదాలు ఆ ప్రాంతంలో మారుమోగాయి. నల్లబ్యాడ్జిలు ధరించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు జ్యోతిబాబురావు, అన్నపూర్ణ శ్రీను, తటవర్తి వాసు, బొట్లగుంట శ్రీహరినాయుడు, మంచాల ప్రసాద్, పోతుగంటి శ్రీకాంత్, చవల రామకృష్ణ, ఎస్.కె.మస్తాన్, కాకి ప్రసాద్, గొట్టిపాటి రాము, మొగిలి కల్లయ్య, తదితర టిడిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలు



**వెంకటాచలం, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త:** ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలకు వెంకటాచలంలోని రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ, వెంకటాచలంలోని క్యాబా ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ పరీక్షలకు పోలీసు శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వెంకటాచలం సీఐ గంగాధర్, ఎస్ఐ అయ్యప్ప ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరీక్షా కేంద్రానికి పరీక్ష రాసే విద్యార్థులు గంట ముందే చేరుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేశారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ కేంద్రంలో 350 మందికి గాను 286 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. క్యాబా ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 300 మందికి గాను 264 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను అడిషినల్ ఎస్పీ హైమావతి పరిశీలించారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

## మందుబాబుల నియంత్రణకు బస్టాండ్‌లో ముళ్ల కంపల ఏర్పాటు



**కోవూరు,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కోవూరులోని బజారు సెంటర్ ప్రాంతంలో శాంతి ఫైనాన్స్ అధినేత వి. బాబురావు తన సోదరుని జ్ఞాపకార్థం ఈ ప్రాంతంలో గతంలో ప్రయాణికులు వేచి ఉండేందుకు లక్షలాది రూపాయలు వ్యయం చేసి బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. అయితే ఈ బస్టాండ్ కొంత కాలం వరకు ప్రయాణికులకు ఉపయోగపడినా.. ఈ ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేయడంతో ఈ బస్టాండ్ మందుబాబులకు నిలయంగా మారింది. ఈ కారణంగా ఈ బస్టాండ్ ప్రయాణికుల కోసం వేచి ఉండే నిలయంగా కాకుండా మందుబాబులు మందు తాగే అడ్డాగా మారిపోయింది. ఫలితంగా దాత ఏ ఉద్దేశంతో ఈ నిర్మాణం చేపట్టాడో అది నెరవేరని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖ ఈ బస్టాండ్ ప్రాంతంలో మందుబాబుల నియంత్రణకు ముళ్ల కంపలు ఏర్పాటు చేశారు. దీంతో ఇది ఎవరికీ ఉపయోగపడని విధంగా తయారైంది. ఈ బస్టాండ్‌ను ప్రయాణికులు వేచి ఉండే బస్టాండ్‌గా తీర్చిదిద్దాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రశాంతంగా ఎస్సై రాత పరీక్షలు



**కోవూరు,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఎస్సై రాత పరీక్షకు సంబంధించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎస్సై రాత పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి కళాశాలలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 7835 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 6548 మంది హాజరయ్యారన్నారు. మరో 987 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరు కావడం జరిగిందన్నారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన ఈ రాత పరీక్షకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టడం జరిగిందన్నారు.

## దళిత,గిరిజనుల సంక్షేమ పథకాల్ని రద్దు చేయడం అన్యాయం



**బిట్రగుంట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత, గిరిజనులకు సంబంధించిన సంక్షేమ పథకాల్ని రద్దు చేయడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజనులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బోగోలు అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగపరంగా ఎస్సీ,ఎస్టీలకు పలు సంక్షేమ పథకాలకు సంబంధించిన నిధులను లబ్దిదారులకు అందించకుండా నవరత్నాలకు మళ్లించి అన్యాయం చేశారని విమర్శించారు. దాదాపు 50 వేల కోట్ల రూపాయలు ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు కూడా ఖర్చు చేయకుండా ఇతర పథకాలకు మళ్లించడం దారుణమన్నారు. ఈ ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్లు కూడా నిర్వీర్యం చేసిందని ఏ ఒక్కరికి కార్పొరేషన్ నుండి సబ్సిడీతో రుణాలు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. అధికార పార్టీ ఎస్సీ,ఎస్టీ ఎమ్మెల్యేలు కూడా వీటిని ప్రశ్నించకపోవడం వారు దళితులకు ద్రోహం చేసిన వారవుతారని ఆరోపించారు. ఇకనైనా తమకు రాజ్యాంగపరంగా సంక్రమించే హక్కులు కాలరాయకుండా సత్వరమే అందేలా చర్యలు తీసుకోకపోతే రానున్న ఎన్నికలలో ఈ ప్రభుత్వానికి గట్టి బుద్ధిచెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి నేతలు మిట్టా అశోక్,దుగ్గిరాల వీరంబోట్లు, ఆత్మకూరు పోలయ్య, కె.రమణయ్య, యానాది సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నాగులవరంలో కనులపండువగా తెప్పోత్సవం

**బిట్రగుంట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** బోగోలు మండలం నాగులవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శివాలయంలో శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆదివారం సాయంత్రం కనులపండుగగా తెప్పోత్సవాన్ని నిర్వహించార. కాంద్ర సతీష్‌నాయుడు, దాతల సహకారంతో ఈ ఏడాది ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.తెప్పోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

## రూ.10 వేలు ఆర్థిక సాయం చేసిన బెస్ట్ వాకర్స్



**కావలి రూరల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** కావలి మున్సిపాల్టీ పరిధిలోని మద్దూరుపాడుకు చెందిన గుండెమడుగుల రాజా యాక్సిడెంట్‌కు గురై నెల్లూరు బొల్లినేని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కావలి బెస్ట్ వాకర్స్ ఆధ్వర్యంలో అధ్యక్షులు టి.వి.శేషయ్య, గౌరవ సభ్యులు డాక్టర్ మోహన్, సయ్యద్ సర్దార్ కిర్మాణి, మందా వెంకటేశ్వర్లు, నల్లపరెడ్డి శ్రీనివాసులు, సభ్యులు ఆదివారం గుండెమడుగుల రాజా తమ్ముడుకి పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవ చేసే గుణం కలిగి వుండాలన్నారు. తమకు తోచిన సహాయాన్ని అందజేయాలన్నారు. అనంతరం ఆర్థిక సహాయం అందజేసిన బెస్ట్ వాకర్స్‌కు రాజా తమ్ముడు కృతజ్ఞతలు తెలిపారు.

## నాణ్యతగా నిర్మాణాలు సాగాలి



**కోవూరు,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కోవూరులోని శాఖా గ్రంథాలయంలో నిర్మాణంలో ఉన్న గ్రంథాలయ భవన పనులను ఆదివారం పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టే ఈ నిర్మాణాలు నాణ్యతతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి సాగాలన్నారు. చేపట్టే పనులు మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన ఇంజనీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల మల్లికార్జున్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



**అల్లూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరు టిటిడి కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులుగా నియమితులైన వారు చేయాల్సిన పనులు వివరించారు. అనంతరం రాష్ట్ర వైసిపి జెసిఎస్ కన్వీనర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ మార్చి 16 నుండి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల పని మొదలవుతుందని త్వరలో వారికి కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి 30 కుటుంబాలకు గృహ సారథిని నియమించడం జరుగుతుందన్నారు. గృహ సారథులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి టిడిపి ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి తేడాను వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరు మండల వైసిపి కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, కావలి ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, జెడ్పీటీసీ వేణమ్మ, సామంతుల సురేష్‌రెడ్డి, బీద రమేష్‌యాదవ్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ జయంతి



**సంగం ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**మండలకేంద్రమైన సంగంలోని గ్రందాలయంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా చత్రపతిశివాజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం లైబ్రరీయన్‌రవీంద్రరెడ్డి మాట్లాడుతు నేటి తరం చత్రపతిశివాజీ లాంటి మహానీయుల ధైర్యసాహసాల గురించి తప్పక తెలుసుకోవాలని అన్నారు.తల్లిమాట కు కట్టుబడిన బిడ్డ చత్రపతి శివాజీ.... పరాయి స్త్రీలను తోబుట్టువులుగా గౌరవించిన గొప్ప రాజు అని ఆయన కొనియాడారు.హిందూ సామాజ్యా స్థాపనకు చత్రపతి శివాజీ చేసిన సాహసాలు అద్భుతమని కొనియాడారు.ఈకార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గోన్నారు.

## కావలి రియల్టర్ల అక్రమ ప్రహరీ గోడల నిర్మాణాల్ని పరిశీలించిన వేదిక బృందం



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** కావలి మున్సిపాల్టీ పరిధిలోని రియల్టర్ల అక్రమ ప్రహరీ గోడల నిర్మాణాల్ని కావలి ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక బృందం నేతలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ వేదిక కన్వీనర్, సిపిఐయంయల్ న్యూడెమోక్రసీ నేత కరవది భాస్కర్, కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్,ప్రముఖ న్యాయవాది చింతాల వెంకట్రావు, సిపియం నేత పసుపులేటి పెంచలయ్య, టిడిపి నేత దావులూరి దేవకుమార్ మాదిగ, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయివిఠల్, నాగార్జున, కె.నరసింహం, ఎల్.లక్ష్మిరెడ్డి, పసుపులేటి మహేష్, గోసాల రవికాంత్, హఫీజ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. కావలి మున్సిపాల్టీ పరిధిలో నుడా అనుమతులు లేకుండా రియల్టర్లు బరితెగించి అక్రమంగా వెంచర్లు వేశారని దుయ్యబట్టారు. కావలి పట్టణంలోని మన్నంగిదిన్నె, గిరిజన కాలనీ, కావలి మాలపాళెం, ఇందిరమ్మ కాలనీలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడల నిర్మాణాల్ని స్వయంగా హక్కుల పరిరక్షణ బృందం పరిశీలించడం జరిగిందన్నారు. స్థానికులతో మాట్లాడామన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్ల పక్కన గిరిజన కాలనీ వుంటే తమ ప్లాట్లు అమ్ముడుపోవని గిరిజనులు, దళితుల ఇళ్లు కనపడకుండా దాదాపు 15 అడుగుల ఎత్తులో గోడలు నిర్మించడం అత్యంత దారుణమన్నారు. ఇది ఒక రకంగా అంటరానితనాన్ని బహిరంగంగా చూపించడమేనన్నారు. ఇలా భారీ ప్రహరీ గోడలు నిర్మించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై దళితుల వేధింపుల క్రింద కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ ప్రహరీ గోడలకు ఇళ్లు అడ్డు వస్తున్నాయని రియల్టర్లు గిరిజనులను బెదిరిస్తున్నారన్నారు. వర్షాలు వచ్చినప్పుడు తమ కాలనీ మునిగిపోతుందని గగ్గోలు పెడుతున్నారన్నారు. స్మశానాన్ని కూడా మాయం చేసి చెరువులో స్మశానాన్ని కేటాయించారన్నారు. వర్షాలు వచ్చినప్పుడు శవాల్ని పూడ్చలేకపోతున్నామన్నారు. ఇందిరమ్మ కాలనీ చుట్టు ప్రహరీ గోడ నిర్మించడంతో ప్రజలు పట్టణంలోకి రావాలంటే చుట్టు తిరిగి రావాల్సి వస్తుందన్నారు.మూడు కిలోమీటర్ల దూరం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు ఇబ్బందిగా మారిందన్నారు. కాలనీల చుట్టు ప్రహరీ గోడలు నిర్మించడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎవరు అనుమతులు ఇచ్చారో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. నుడా అనుమతులు లేకుండానే భారీగా వెంచర్లు వేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారన్నారు. ఈ వెంచర్ల కోసం పెద్దపెద్ద మట్టి తిప్పలు సైతం తొలిచివేసి అక్రమ వెంచర్లకు గ్రావెల్‌ను తరలిస్తున్నారన్నారు. ఇవన్నీ అధికారులకు, కావలి ఎమ్మెల్యేకు తెలిసి వారి ప్రోత్సాహంతో వారి భాగస్వామ్యంతో జరుగుతున్నాయని దుయ్యబట్టారు. అధికార పార్టీ నేతల అండదండలతో రియల్టర్లు రెచ్చిపోతున్నారన్నారు.నుడా అధికారులకు, మున్సిపల్ అధికారులకు పొంతన లేకుండాపోవడంతో ముడుపులు రాజ్యమేలుతూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు.ఈ భారీ ప్రహరీ గోడల, అక్రమ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు, అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్ల బాగోతాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఈ వేదిక నేతలు హెచ్చరికలు చేశారు. ప్రజలు స్పందించి వీటిని అడ్డుకోకపోతే అభివృద్ధికి గండిపడుతుందని తెలిపారు.

## బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తిని సత్కరించిన మాజీ ఎజిపి పోట్లూరి



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** కావలి జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ అన్నపూర్ణేశ్వరి విజయవాడ 5వ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కావలి ప్రముఖ న్యాయవాది, మాజీ ఎజిపి పోట్లూరి శ్రీనివాసులు ఆదివారం న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. న్యాయమూర్తి అన్నపూర్ణేశ్వరి కావలిలో పనిచేయడం కొద్దికాలమైనప్పటికీ ఎన్నో గొప్పగొప్ప తీర్పులు ఇచ్చారన్నారు. లోక్‌అదాలత్‌లో ఎన్నో మొండి కేసులను కొట్టివేసి సమర్థవంతంగా పరిష్కరించారన్నారు. కష్టపడి పనిచేస్తున్న ఈ న్యాయమూర్తి ఎన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

## కమనీయం కోటేశ్వరస్వామి కళ్యాణం

**చేజర్ల,ఫిబ్రవరి19ప్రభాతవార్త:** కామాక్షిదేవి సమేత కోటేశ్వరస్వామి కళ్యాణం ఆదివారం రాత్రి కోటితీర్థంలో కమనీయంగా జరిగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి ఏటా స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆదివారం రాత్రి ఉభయకర్త కొమ్మి శ్రీనివాసులునాయుడు స్వామి-అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అందజేశారు. ఆలయ పూజారి సుదర్శనశర్మ స్వామి-అమ్మవార్ల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. స్వామి-అమ్మవార్లతరపున వేద పండితులు ఎదురుకోలు నిర్వహించారు. కళ్యాణఘట్టంలోని అంశాలను వివరిస్తూ మంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు.ఆలయ పాలకమండలి చైర్మెన్ గోతం మాధవి, దేవాదాయశాఖ అధికారులు , గ్రామస్తులు, ఉభయకర్తలు కళ్యాణంలో పాల్గొన్నారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామి-అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. భాజాభజంత్రీలు, బాణాసంచా మోతల మధ్య గ్రామోత్సవం వైభవంగా సాగింది.

## రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి



**చేజర్ల,ఫిబ్రవరి19ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చేజర్ల సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో షర్ఫుద్దీన్ (17)మృతిచెందాడు. సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చేజర్లకు చెందిన షర్ఫుద్దీన్ స్థానిక సివిఆర్ అండ్ ఎస్ఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం తన స్నేహితుడిని పక్క గ్రామమైన తిమ్మాయపాళెంలో వదిలిపెట్టి తిరిగి వస్తున్న సమయంలో చేజర్ల నాగశిలల సమీపంలో పందుల లోడుతో వెళుతున్న ఆల్విన్ వ్యాన్‌ను ఢీకొట్టాడు. దీంతో రోడ్డు మీద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. షర్ఫుద్దీన్ వెంట బైక్‌లో ఉన్న అతని స్నేహితుడు యూసఫ్‌గనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్సకై ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మరిడినాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. నాగులు రోజుల క్రితమే కాలేజీలోని విద్యార్థులకు బైక్ డ్రైవింగ్, మత్తుపదార్థాల నిషేదం తదితర విషయాలపై అవగాహనా సదస్సును కూడా నిర్వహించారు. షర్ఫుద్దీన్ మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

## వేడుకగ సత్యమ్మ తల్లి పాలపొంగళ్ళు



**కలువాయి పిబ్రవరి 19 ప్రభాతవార్త:** మండలంలోని తోపుగుంట అగ్రహారం గ్రామంలో ఆదివారం గ్రామ దేవత శ్రీసత్యమ్మ తల్లి అమ్మ వారికి పాల పొంగళ్ల కార్యక్రమాన్ని అగ్రహారగ్రామస్తులువేడుకగానిర్వహించారు.ప్రతి ఏడాదిలాగానే దూర ప్రాంతాలలో ఉండే గ్రామస్తులు భక్తులు గ్రామానికి చేరుకొని అమ్మవారి పాలపొంగళ్ల కార్యక్రమంలో పాల్గోన్నారు.సాంప్రదాయ బద్ధంగా మహిళలు ఇంటి నుండి అమ్మవారికి పసుపు,కుంకుమ వస్త్రాలతో పాటు పొంగళ్ళు,పూజా సామాగ్రిని గంపలకు అలంకరించి వేడుకగా అమ్మవారి సన్నిధికి చేరుకొని పొంగళ్ళు పొంగించి అమ్మవారికిని వేదించారు. గ్రామంసుభిక్షంగా ఉండాలని సత్యమ్మతల్లిని వేడుకున్నారు.మద్యహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాని నిర్వహించారు. అమ్మవారిని రకరకాల పూలతో ప్రత్యేకంగా అలకరించారు. రకరకాల పూలతో ఎంతో అందంగా అలంకరించన అమ్మవారి ప్రతిమను చూసి ప్రజలు పరవశించారు.ఈకార్యక్రమంలో వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణా అమ్మవారిని దర్శించుకున్నారు.అనంతరం జడ్‌పిటిసి సభ్యులు బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి ,ఎంపిపి ఆర్‌లక్ష్మీదేవి,సొసైటీ అద్యక్షులు చల్లా సుబ్బరామిరెడ్డి స్ధానిక నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## మంత్రి కాకాణీతో స్థానిక సంస్థల యంఎల్‌సి అభ్యర్థి మేరిగ మురళీధర్



**రాపూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** రాష్ట వ్యవసాయ శాఖా మంత్రి కాకాణీ గోవర్ధన్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ మరియు స్ధానిక సంస్ధల యంఎల్‌సీ అభ్యర్ధి మేరిగ మురళీధర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ధానిక సంస్ధల యంఎల్‌సీ అభ్యర్ధిగా ప్రకటించిన అనంతరం కాకాణీ నివాస గృహానికి వెల్లిన మేరిగ మురళీధర్ మంత్రికి శాలువా కప్పి పూల బోకేను ఆందజేశారు. ఈసందర్బంగా మంత్రి కాకాణీ గోవర్ధన్ రెడ్డి మేరిగ మురళీధర్‌కు శాలువా కప్పి ఆభినందనలు తెలిపారు. తాను స్ధానిక సంస్ధల యంఎల్‌సీ అభ్యర్ధిగా ఈ నెల 22వ తేది నామినేషన్ ధాఖలా చేస్తున్నట్లు ఆ కార్యక్రమానికి హజరై తనను ఆశీర్వదించాలని మేరిగ కాకాణీని కోరారు.ఈయన వెంట రాపూరు మండల వైసిపి నాయకుడు శ్రీకిరెడ్డి శశిధర్ రెడ్డి, మాజీ జిల్లా ప్రచార కన్వినర్ పాండు రంగా రెడ్డి,చిట్టమూరు మండల వైసిపి నాయకులు కస్తూరి రెడ్డి తదితరులున్నారు.

## యంఎల్‌సీ అభ్యర్గిగా మేరిగ మురళీధర్ ఎంపిక పట్ల రాపూరులో ఆనందోత్సవాలు

**రాపూరు, ఫిబ్రవరి 19 ప్రబాతవార్త:** నెల్లూరు జిల్లా స్ధానిక సంస్ధల యంఎల్‌సీ అభ్యర్ధిగా మేరిగ మురళీధర్‌ను ఎంపిక చేయడం పట్ల రాపూరుమండలంలో ఆనందోత్సవాలు వెలువెత్తాయి. ఈ సందర్బంగా పెద్ద ఎత్తున వైసిపి నాయకులు, మేరిగ మురళీధర్ అభిమానులు, ఇతర పార్టీలలో వున్న పలువురు నాయకులు సైతం ఆయనకు యంఎల్‌సి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పార్టీని కష్టకాలంలో సైతం విడవకుండా అంటి పెట్టుకోని వుండి పార్టీ పటిష్టత కోసం కృషి చేసిన మేరిగకుయంఎల్‌సీ అభ్యర్ధిగా పదవి దక్కడం పట్ల ఆనందాలు వ్యక్తం చేస్తూ పట్టణంలో భాణసంచా కాల్చి సంభరాలు నిర్వహించారు.దీంతో పాటు రాపూరు మండల వాసికి యంఎల్‌సీ పదవి రాబోతుందన్న ఆనందం మండలంలోని అన్ని వర్గాల వారి నుండి వ్యక్తం అవుతుంది. ఈ సందర్బంగా పలువురు నాయకులు, మిత్రులు మేరిగ మురళీధర్ ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## పెనుశిల నృసింహుని సేవలో పాపకన్ను మధుసూధన్ రెడ్డి



**పెంచలకోన(రాపూరు),ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారిని ఆదివారం రాపూరువ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాపకన్ను మధుసూధన్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్బంగా ఆయన స్వామి,అమ్మవారు, అంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వెంకటగిరిలోని తిరుపతి జిల్లా వైసిపి ఆధ్యక్షుడు, రాష్ట కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్,వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిని కలుసుకోని రాపూరు మండలానికి చెందిన పలు విషయాలను ఆయనతో చర్చించారు. అనంతరం రాపూరులోని మద్దెలమడుగు సెంటర్‌లో వున్న తెలుగుగంగ అతిధిగృహంలో పలు గ్రామాల నుండి వచ్చిన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈయన వెంట మండలంలోని వైసిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గోన్నారు.

## కావలి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తించిన మృతదేహం



**కావలి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** కావలి రైల్వే స్టేషన్ ఉత్తరం వైపున యార్డు వద్ద కెయం నెం.225/సి6-సి7 పోస్టుల మధ్య మూడవ లైన్ రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని 45-50 సంవత్సరాల వయసు కల్గిన మృతదేహాన్ని ఆదివారం రైల్వే పోలీసులు గుర్తించారు. రక్తగాయాలతో మృతి చెందిన వ్యక్తి జేబులో తిప్ప నుండి కావలికి వచ్చిన బస్సు టికెట్ వుందని రైల్వే పోలీసులు తెలిపారు. అతని వద్ద లభించిన హాస్పిటల్ ఓపి స్లిప్‌లో పేషెంట్ పేరు బాబు, తండ్రి పేరు జాన్ అని వుందని తెలిపారు. మృతుడి ఊరు, పేరు తెలియలేదని తెలిపారు. మృతుడు నల్లని నిండు చేతుల జర్కిన్, బ్లూకలర్ నిండు చేతుల చొక్కా, గోధుమ రంగు ఫ్యాంట్ ధరించి వున్నాడని తెలిపారు. మృతుడి జేబులో తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌కు చెందిన పల్మనాలజీ డిపార్ట్‌మెంట్‌లో వైద్యం చేయించుకున్న కార్డు వుందని పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకి తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.